## కేంద్రం విధానాలతో కార్మికులకు నష్టం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 13 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో కార్మికులు, రైతులకు తీవ్రంగా నష్టం జరుగుతోందని సీపీఐ నేతలు విమర్శించారు. షాపూర్‌నగర్ నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు మంగళవారం ర్యాలీ తీశారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో నేతలు మాట్లాడారు. ఈ నెల 16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పి వారి ఆర్థిక పరిస్థితి దిగజారేలా చేశారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సూచించారు. ఏఐటీయూసీ నేతలు ఉమామహేశ్, హరినాథ్, రాములు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా రజినీకాంత్

అల్లాపూర్, ఫిబ్రవరి 13: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మోతీనగర్ పరిధి కబీర్‌నగర్‌కు చెందిన కాలేరు రజినీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు కంది శ్రవణ్ రెడ్డి, నియోజవర్గ ఇన్‌చార్జ్ బండి రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్ రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని రజినీకాంత్ అందుకున్నారు.





బహిరంగ సభకు గచ్చిబౌలి నుంచి వెళ్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం, బీఆర్ఎస్ శ్రేణులు

# సాగునీటి హక్కులను కాపాడుతాం

- చలో నల్గొండ సభకు తరలిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, గులాబీ శ్రేణులు

మియాపూర్/ శేరిలింగంపల్లి / కేపీహెచ్‌బీ కాలనీ / కుత్బుల్లాపూర్ జోన్ బృందం, ఫిబ్రవరి 13 : చలో నల్గొండ భారీ బహిరంగ సభకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మంగళవారం వారి నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన బస్సుల్లో ఎమ్మెల్యేలతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సభకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ.. బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్గొండ సభకు వెళ్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు.

- కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ సతీశ్‌గౌడ్, బాలానగర్ నుంచి కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ నుంచి కార్పొరేటర్ నర్సింహయాదవ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు నల్గొండ సభకు తరలివెళ్లారు.
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నేతృత్వంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్ పటేల్, దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, శ్రీకాంత్, మంజులరఘునాథ్‌రెడ్డి, మాధవరం రోజాదేవి, సింధురెడ్డి, మాజీకార్పొరేటర్లు సాయిబాబా, రంగారావుతో పాటు బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సభకు వెళ్లారు.
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్లలోని వివిధ డివిజన్‌లతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



చలో నల్గొండ సభకు వెళ్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బస్సులో బయలుదేరుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


## లక్ష్మీవేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

### నేడు కల్యాణోత్సవం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 13 : జగద్గిరిగుట్ట శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం ఆలయ పరిసరాల్లో చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యేలు అరెకపూడిగాంధీ, మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ నేత డా.భద్రారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, ఆలయ చైర్మన్ వేణుయాదవ్, కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, పాపిరెడ్డి, సమ్మయ్య, అనిత, మహేశ్ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

**ప్రారంభమైన జాతర..**

మూడురోజులపాటు జరిగే వేంకటేశ్వర స్వామి ఆలయ 53వ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేలు, ఆలయ ప్రతినిధులు విశేషపూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, వేదపారాయణం జరిపారు.




ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు



గండిమైసమ్మలోని తెలంగాణ భవన్ నుంచి సభకు కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ ఆధ్వర్యంలో తరలుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

## శుభాకాంక్షలు..



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ పరీక్షల విభాగం అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ అరుణ కుమారికి వర్సిటీ విద్యార్థి జేఏసీ, వివిధ సంఘాల విద్యార్థి నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ చైర్మన్ భిక్షపతి, సందీప్, తేజ, విక్రాంత్, ప్రకాశ్, బంజారా విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 13

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్, ఫిబ్రవరి 13 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డు మల్లంపేట్ వద్ద 4ఏ ఎగ్జిట్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాల కోసం ప్రయత్నించగా ఎటువంటి సమాచారం లభించలేదు. మృతుడు యాచకుడు అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఒంటిపై సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, సుమారు 50 ఏండ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు శవాన్ని పోస్ట్‌మార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించారు.

## 19 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 13 : ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 19 నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ' పేరుతో ఆఫ్‌లైన్‌లో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతి రోజూ ఉదయం ఆరున్నర నుంచి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలని , వివరాలకు 7989903 001 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## మల్లిఖార్జునస్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి13 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మెట్‌కానిగూడ మల్లిఖార్జునస్వామి దేవస్థానం జాతరను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం జీడిమెట్ల దండముడి ఎన్‌క్లేవ్‌లో ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఉత్సవ కమిటీ నిర్వాహకులు కలిసి జాతర ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌యాదవ్, సభ్యులు సత్యనారాయణయాదవ్, గోపాల్‌యాదవ్, బాల్‌రాజ్‌యాదవ్, మహేందర్‌యాదవ్, భీమ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, సంపత్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీని కలిసిన ప్రజలు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, ఫిబ్రవరి 13 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, సంక్షేమసంఘాల ప్రతినిధులు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ, తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## ఆలయానికి విరాళం..



ఎక్కల్దేవ్ మైసయ్య యాదవ్ గారి 10 వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మూసాపేట్ గూడ్‌షెడ్ రోడ్‌లో గల పోచమ్మ తల్లి దేవస్థానం నిర్మాణానికి రూ.2.50లక్షలు, మైసమ్మ చెరువు అలుగు వద్ద ఉన్న శ్రీ ఈదమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు, అలాగే మైసమ్మ చెరువు వద్ద ఉన్న దోబీఘాట్ దగ్గర ఈదమ్మ ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.25వేలు విరాళంగా అందజేశారు.

## మహిళా హక్కుల కోసం ఉద్యమించాలి

జీడిమెట్ల, ఫిబ్రవరి13 : కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలతో సహా అన్నివర్గాల ప్రజలు నష్ట పోతున్నారని ప్రగతిశీల మహిళాసంఘం నేతలు విమర్శించారు. జీడిమెట్లలో మంగళవారం శిక్షణాతరగతులు నిర్వహించారు. సరళ, భారతి, కత్తి పద్మ, సంధ్య, అనురాధ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. లైంగికదాడులు, హింస పెరిగిపోయి మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం విచ్చలవిడిగా అమ్మడంతోపాటు ఇంధన ధరలు పెరిగాయన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, ఇందుకోసం అన్నిరంగాల్లోని మహిళలు సంఘటితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళా నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ

మియాపూర్, ఫిబ్రవరి 13 : తాజాగా విడుదలైన జేఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో శేరిలింగంపల్లి మండల మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి మహ్మద్ అయూబ్ ప్రతిభ కనబరిచాడు. ఈ పరీక్షలో 94.87 పర్సంటేజీని సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అయూబ్ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యను అభ్యసించి ఈ ప్రతిభను ప్రదర్శించారు. ఈ మేరకు విద్యార్థినిని ప్రిన్సిపాల్ చందర్‌రెడ్డి మంగళవారం పాఠశాలలో అభినందించారు. నాణ్యమైన విద్యాబోధనకు మైనార్టీ గురుకుల పాఠశాలలు నిదర్శనమని పేర్కొన్నారు.



అయూబ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చందర్‌రెడ్డి

## జయశంకర్ కాలనీలో పర్యటన

మియాపూర్, ఫిబ్రవరి 13 : ఆల్విన్ కాలనీ డివిజన్ జయశంకర్ కాలనీలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను ప్రజలు ఆయనకు విన్నవించారు. అనంతరం జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సాంబశివరావు, శేషు, శిరీష, రవి, రఫిక్, కృష్ణ పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



మూసాపేట వార్డు కార్యాలయం వద్ద డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట, ఫిబ్రవరి13: డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో స్థానికులను వేధిస్తున్న డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మూసాపేట డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మూసాపేట వార్డు కార్యాలయం వద్ద రూ. 20లక్షలు, బాబూ జగ్జీవన్ రామ్ బస్తీలో రూ. 8లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను జలమండలి మేనేజర్ సలోమితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, బీజేపీ నాయకులు మల్లేశ్ గౌడ్, బస్తీ అధ్యక్షుడు రమేశ్, మహిళా నాయకులు జానకి, రాజేశ్వరి పాల్గొన్నారు.

## 16 న దేశ వ్యాప్త సమ్మె

మియాపూర్, ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏఐసీటీయూ ఆధ్వర్యంలో మియాపూర్ లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. కార్మిక కర్షక లోకం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ గ్రేటర్ నాయకుడు కర్ర దానయ్య కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

దుండిగల్, ఫిబ్రవరి 13 : పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రగతినగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులతో మేయర్ సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న వాటిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్వహణ, పార్కులు, చెరువులు, కుంటల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు, శానిటేషన్, విద్యుత్ సంబంధిత పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఎలక్ట్రికల్, హార్టీకల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్, రాజీవ్‌గృహకల్ప సముదాయంలో మల్లారెడ్డి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ నీలాగోపాల్ రెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ డా.భద్రారెడ్డితో కలిసి పలువురికి మందులు పంపిణీ చేశారు. పేదప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, దివాకర్, వీరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు

## సరోజినీ నాయుడు జయంతి



సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చందానగర్‌లోని తపస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ సరోజినీ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫౌండేషన్‌లోని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లతో పాటు పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.

– కొండాపూర్, ఫిబ్రవరి 13

## యూనియన్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఎం అండ్ హెచ్‌వోలు రఘునాథ్ స్వామి, రామ్‌కుమార్

బాలానగర్, ఫిబ్రవరి 13 : ఫతేనగర్ డివిజన్ పరిధిలోని స్మార్ట్ ప్రెసిడెన్సీహాలులో మంగళవారం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పీ.రవికుమార్ ఆధ్వర్యంలో 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేడ్చల్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రఘునాథ్ స్వామి, కూకట్‌పల్లి జోన్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌కుమార్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వోలు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణ రావ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలానగర్ పీహెచ్‌సీలో పని చేసి అనారోగ్య కారణాల వల్ల మృతి చెందిన కుమారి కుమారుడికీ బాలానగర్ పీహెచ్‌సీ ఉద్యోగులందరూ రూ.లక్షను విరాళంగా అందజేశారు. రాష్ట్ర యూనియన్ కోశాధికారి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలు

కొండాపూర్, ఫిబ్రవరి 13 : ఆర్య సమాజ సంస్థాపకుడు, స్వాతంత్ర్య ఉద్యమ ప్రధాత మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలను భారత ప్రభుత్వం రెండేండ్ల పాటు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ, దయానంద సరస్వతి ఉత్సవ కమిటీ మెంబర్ ప్రొఫెసర్ బీజే రావు తెలిపారు. మంగళవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీలో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18న ఉదయం 10 గంటలకు నిజాం కాలేజీ నుంచి రవీంద్ర భారతి వరకు శోభాయాత్రను నిర్వహించనున్నటు తెలిపారు. అనంతరం రవీంద్ర భారతిలో ప్రత్యేక సభ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాల ఆర్య సమాజ్ ప్రతినిధి డాక్టర్ ధర్మతేజ, పాల్గొన్నారు.



దయానంద సరస్వతి జయంతి ఉత్సవ కమిటీ సమావేశంలో పాల్గొన్న కమిటీ మెంబర్లు బీజే రావు, తదితరులు

# కొలువుదీరిన బాంబే సర్కస్..



సిటీబ్యూరో, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ) : ముప్పై ఏండ్ల తర్వాత నగరంలోని కుత్బుల్లాపూర్ హెచ్ఎంటీ గ్రౌండ్‌లో ఆసియాలోనే అతిపెద్ద బాంబే సర్కస్ కొలువు దీరింది. ఈ నెల 10న ప్రారంభమైన ఈ సర్కస్‌కు జనాల నుంచి అనూహ్య స్పందన వస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సర్కస్ అద్భుతమైన విన్యాసాలతో సందర్శకులను అలరిస్తూ వినూత్న అనుభూతిని కలిగిస్తుందని, కుటుంబ సమేతంగా అందరూ కలిసి వీక్షించే విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. 80మంది దేశీయ, విదేశీ కళాకారులతో అద్భుతమైన విన్యాసాలు స్టంట్లు, జోకర్లతో కడుపుబ్బ నవ్వించే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు షోలు ఉంటాయని, తిరిగి రాత్రి 7 గంటలకు మరో మూడు ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

